క్లుప్తంగా

ఆలయ అడహక్ కమిటీ రద్దు

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని బేచిరాగ్ మాదారం ముత్యాలమ్మ ఆలయ అడహక్ కమిటీని రద్దు చేస్తున్నట్లు ఆలయ శాశ్వత కమిటీ అధ్యక్షుడు వల్దాస్ ఏడుకొండలు ప్రకటించారు. బుధవారం దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 10న అమ్మవారి బోనాల మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలను శాశ్వత కమిటీ ఆధ్వర్యంలోనే జరుపనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి కోసం భక్తులు ఎలాంటి విరాళాలు ఇవ్వొద్దని, ఎవరైనా విరాళాలు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ నెల 10న నిర్వహించే బోనాల మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో శాశ్వత కమిటీ సభ్యులు వల్దాస్ రాజీవ్, సలీమ్, షేక్ మహిమూద్ పాల్గొన్నారు.

లక్ష్యంతో చదవాలి



మాట్లాడుతున్న ముత్యాల రాజు

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల రాజు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవలం డిప్లొమా విద్యను అభ్యసించడమే కాకుండా నైపుణ్యాలను కూడా మెరుగు పరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాలలో ఉన్న అత్యాధునిక ల్యాబ్‌లు, లైబ్రరీ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు ఫేస్ రికగ్నిషన్


అర్వపల్లి పోస్టాఫీస్‌లో పింఛన్‌దారుడి ఫేస్ రికగ్నిషన్ తీసుకుంటున్న పోస్టల్ సిబ్బంది

అర్వపల్లి : పింఛన్‌దారులకు ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) కార్యక్రమం మొదలైంది. ఇప్పటివరకు ఆసరా పింఛన్‌దారులకు ప్రతినెలా బయోమెట్రిక్ ద్వారా డబ్బులు చెల్లిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఫేస్ రికగ్నిషన్ కార్యక్రమం చేపట్టారు. బుధవారం మండలవ్యాప్తంగా పింఛన్ల పంపిణీ మొదలు కాగా పోస్టల్ సిబ్బంది తమ సెల్‌ల ద్వారా పింఛన్‌దారుల ఫేస్ రికగ్నిషన్ చేసి డబ్బులు ఇస్తున్నారు. ఫేస్ రికగ్నిషన్ ఉంటేనే పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎస్‌పీఎం దయాకర్ తెలిపారు.

ఎట్టకేలకు చెత్త తరలింపు


చెత్తను తరలిస్తున్న సిబ్బంది

ఆత్మకూర్ (ఎస్) : జీపీ ట్రాక్టర్ పనిచేయడంలేదని గత కొన్ని రోజులుగా కోటపహాడ్ గ్రామంలో చెత్తను సేకరించకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిందని ఆరోపిస్తూ మంగళవారం గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట చెత్తను వేసి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ హసీం స్పందించి.. ట్రాక్టర్‌ను రిపేర్ చేయించాలని, వెంటనే చెత్తను తరలించాలని జీపీ సిబ్బందిని ఆదేశించారు. దీంతో ట్రాక్టర్‌ను మరమ్మతు చేయించి గ్రామంలోని పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు.

పశు వైద్యశిబిరం

పెన్‌పహాడ్: పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారులు అనంతుల వెంకన్న, యర్రంశెట్టి కిరణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని జల్మాలకుంట తండాలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పానుగోడు పశువైద్యాధికారి జయసుధ, శ్రీకాంత్, గోపాలమిత్రలు సైదులు, మహబూబ్‌అలీ, నగేష్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం

అర్వపల్లి : క్షయ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ కోరారు. సూర్యానాయక్‌తండాలో బుధవారం క్షయ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 20మందికి వైద్యపరీక్షలు జరిపారు. కార్యక్రమంలో టీబీ నివారణ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ఎల్‌టీ చొక్కయ్య, ఎంఎల్‌హెచ్‌పీ వశ్రిత, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, ఊర్మిళ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

వానొస్తే.. తడుస్తూనే చదువులు


వర్షానికి కురుస్తున్న తరగతి గది స్లాబు


వర్షపు నీరు పడి తడుస్తున్న తరగతి గది


తడుస్తున్న గదిలోని సామగ్రి

- తుమ్మల పెన్‌పహాడ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కురుస్తున్న తరగతి గదులు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- కంప్యూటర్లు, బోర్డులపై బస్తాలు కప్పి జాగ్రత్త పడుతున్న ఉపాధ్యాయులు

ఆత్మకూర్ (ఎస్) : తుమ్మల పెన్‌పహాడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం వర్షాలకు కురుస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2002లో ఎంవీ ఫౌండేషన్, రౌండ్ టేబుల్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో 8 గదులతో నిర్మించిన ఈ పాఠశాల భవనం గత మూడు సంవత్సరాలుగా వర్షాలకు లీకేజీ సమస్యను ఎదుర్కొంటోంది.

విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు..

గత సంవత్సరం ।మన ఊరు మనబడి। పథకం కింద మరమ్మతుల కోసం రూ. 1,90,000 మంజూరయ్యాయి. అయితే, గుత్తేదారు నాసిరకం పనులు చేయడంతో ఇప్పుడు అన్ని గదులూ లీకవుతూ చిత్తడిగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే భవనం మొత్తం కారుతూ గదులు తడిసిపోయాయి. దీంతో పాఠాలను బోధించేందుకు ఉపాధ్యాయులు, కూర్చోవడానికి విద్యార్థులు నానా అవస్థలు పడవలసి వచ్చింది. పెద్ద వర్షాలు వస్తే పాఠశాలకు సెలవు ప్రకటించాల్సి వస్తుందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో 73 మంది విద్యార్థులు, 11 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వర్షాలకు భవనం లీకవడంతో పాఠశాలలోని సామగ్రిని తడవకుండా కాపాడుకోవడానికి ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. డిజిటల్ తరగతులు చెప్పే బోర్డుకు పైన నీళ్లు పడకుండా ఫ్లెక్సీ కప్పి జాగ్రత్త పడుతున్నారు.


భవనం లీకై నీళ్లు పడుతుండటంతో డిజిటల్ బోర్డు తడవకుండా అడ్డుగా పెట్టిన ఫ్లెక్సీ

అన్ని గదులదీ అదే పరిస్థితి..

పాఠశాలలో ఉన్న 8 తరగతి గదుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గతంలో ఒకటి రెండు గదులు మాత్రమే లీకవగా, ఇప్పుడు మరమ్మతుల తర్వాత అన్ని గదులూ కారుతుండటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే పాఠశాలలో చదువు చెప్పడం కష్టమవుతుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి పాఠశాల భవనానికి నాణ్యతతో కూడిన మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భవనం మొత్తం కురుస్తోంది



వర్షం వచ్చిన సమయంలో భవనం మొత్తం కురుస్తోంది. విద్యార్థులను కూర్చోబెట్టడం కూడా ఇబ్బందిగానే మారుతోంది. బోర్డులు, కంప్యూటర్లు, కరెంటు బోర్డులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులతోపాటు పుస్తకాలు, బీరువాలు తడుస్తున్నాయి. వాటిని ఎక్కడ పెట్టాలో అర్థం కావడం లేదు. తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించాలి.

– వెంకన్న, ప్రధానోపాధ్యాయుడు

వేంకటేశ్వరుడికి లక్ష తులసి పూజ


లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం ఆండాళ్ గోష్ఠి భక్త బృందం ఆధ్వర్యంలో బదరీ నారాయణ తిరునక్షత్ర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని అలంకరించి సహస్రనామాలతో లక్ష తులసి పూజ జరిపారు. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సుదర్శన మహాయాగం..

శ్రీసుదర్శన జయంతిని పురస్కరించుకొని బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఆలయంలో శ్రీసుదర్శన మహాయాగం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు వేణుగోపాలాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి తరించాలని కోరారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


నూతనకల్ : లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే


తిరుమలగిరిలో కాటమయ్య కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

- ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని 9 మండలాల గౌడ కులస్తులకు 474 కాటమయ్య రక్షణ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎల్.శ్రీనివాస్‌నాయక్, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతినరేష్, సైదులు, ఎక్సైజ్ సీఐ రజిత, నరేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో గత పదేళ్ల కేసీఆర్ కుటుంబ పాలన సాగిందని, ఏ ఒక్కరికి కూడా ఇల్లు రాలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.17 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉండేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయే సమయానికి రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, హౌసింగ్ పీడీ సిద్దార్థ, డీపీఓ యాదగిరి, తహసీల్దార్ హరిప్రసాద్, ఎంపీడీఓ లాజరస్, పార్టీ మండల అధ్యక్షుడు నరేష్, జమ్మిలాల్, పేరాల వీరేష్ పాల్గొన్నారు.

నూతనకల్ : మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. మండలానికి నూతనంగా 1959 రేషన్‌కార్డులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. అర్హత కల్గిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం రేషన్‌కార్డులు అందిస్తుందని అన్నారు. అదే విధంగా ఎర్రపహాడ్ గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం, దిర్శనపల్లిలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ అప్పారావు, ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, మండల ప్రత్యేక అధికారి యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత పాల్గొన్నారు.

గడపగడపకూ ప్రభుత్వ వైఫల్యాలు


మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి, చిత్రంలో కిశోర్, బడుగుల లింగయ్య యాదవ్, కంచర్ల రామకృష్ణారెడ్డి

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి


మోత్కూరు : తెలంగాణ ఉద్యమ తరహాలో ప్రభుత్వ వైఫల్యాలను గడపగడపకూ తీసుకెళ్లాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మోత్కూరు, అడ్డగూడూరు మండలాల బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం బుధవారం మోత్కూరు మండలంలోని పాటిమట్లలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు ద్రోహం చేసే వారిని సర్కస్ ఆట ఆడటమే తన లక్ష్యమన్నారు. ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజల దృష్టిని మరల్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి చేతకాని మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. యాదాద్రి, సూర్యాపేట జిల్లాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాదరణ కోల్పోయిందన్నారు. అన్నింటిలో వైఫల్యం చెందిన కాంగ్రెస్‌ను.. స్థానిక సంస్థల్లో ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కార్యకర్తలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, ప్రజల దృష్టి మళ్లించడానికే సీఎం రేవంత్‌రెడ్డి పొద్దస్తమానం కేసీఆర్‌ను తిట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా కొరత నెలకొని రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై పోలీసుల వేధింపులు అధికమయ్యాయని, మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు మారుతాయని, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలపై హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ ఒంటెద్దు నర్సింహారెడ్డి కార్యకర్తలకు అవగాహన కల్పించారు. బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన సాగు నీటి ప్రాజెక్టులు, కాల్వలు, సాగు నీటి విడుదలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారంపై ప్రొజెక్టర్ ద్వారా పార్టీ శ్రేణులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల రామకృష్ణారెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, మాజీ జెడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, మోత్కూరు, అడ్డగూడూరు మండల పార్టీ అధ్యక్షులు పొన్నబోయిన రమేష్, కె.ప్రభాకర్‌రెడ్డి, మండల కార్యదర్శులు సీహెచ్ సత్యం గౌడ్, గిరగాని శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు జంగ శ్రీను, కార్యదర్శి గజ్జి మల్లేషం, నాయకులు పొన్నాల వెంకటేశ్వర్లు, మర్రి అనిల్‌కుమార్, కొండా సోంమల్లు, రాంపాక నాగయ్య, దాసరి తిరుమలేష్, అండెం రాజిరెడ్డి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

అర్వపల్లి : ఎస్సీ గురుకుల కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్‌లో చేరుటకు ఆయా కళాశాలల నందు గురువారం స్పాట్ అడ్మిషన్ల కార్యక్రమం జరుగుతుందని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య తెలిపారు. బుధవారం అర్వపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ విద్యార్థులు ఈ స్పాట్ అడ్మిషన్ల కార్యక్రమానికి తగు ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు స్వరూప, రాములు, స్వామి, వెంకన్న పాల్గొన్నారు.

ఏటేటా తగ్గుతున్న అపరాల సాగు

- తుంగతుర్తి మండలంలో నాలుగేళ్లుగా వరిసాగు వైపే మొగ్గుచూపుతున్న రైతులు



తుంగతుర్తి : ఒకప్పుడు తుంగతుర్తి మండలంలో పెసర, కంది, బొబ్బెర, మినుములు వంటి పప్పుధాన్యాల(అపరాలు) పంటలు విస్తృతంగా ఉండేవి. రైతులు వీటిని విరివిగా పండించి తమ అవసరాలను తీర్చుకోవడమే కాకుండా మార్కెట్‌కు కూడా అందించేవారు. అయితే గత కొంతకాలంగా ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పప్పుధాన్యాల పంటల సాగు గణనీయంగా తగ్గిపోయింది. దీంతో వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. తుంగతుర్తి మండలంలో కంది పంటను నాలుగు సంవత్సరాల క్రితం 2,500 ఎకరాలలో సాగు చేయగా, ప్రస్తుతం 150 ఎకరాలకు తగ్గింది. పెసర పంటను నాలుగు సంవత్సరాల క్రితం 700 ఎకరాలలో సాగు చేయగా, ప్రస్తుతం 30 ఎకరాలకు తగ్గింది. బొబ్బెర్ల పంటను నాలుగు సంవత్సరాల క్రితం 10 ఎకరాలలో సాగు చేయగా, ప్రస్తుతం 5 ఎకరాలకు తగ్గింది. మినుములను వానాకాలంలో పూర్తిగా సాగు చేయడం లేదు. యాసంగిలో కూడా కేవలం 10 ఎకరాలలో మా త్రమే సాగు చేస్తున్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం రైతులు ఎక్కువగా పత్తి సాగు వైపు మొగ్గు చూపారు. తుంగతుర్తి మండలంలో సుమారు 9,000 ఎకరాలలో పత్తి సాగు చేసేవారు. అయితే ప్రస్తుతం పత్తి సాగు కూడా తగ్గి కేవలం 3,000 ఎకరాలకు పరిమితమైంది.

వరి సాగుకే ప్రాధాన్యం..

పప్పుధాన్యాల పంటల సాగు తగ్గడానికి, పత్తి సాగు కూడా తగ్గుముఖం పట్టడానికి ప్రధానంగా కారణం రైతులు వరి సాగు వైపు మళ్లడం. తుంగతుర్తి మండలంలో సుమారు 22,000 ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా గత నాలుగు సంవత్సరాలుగా నీరు పుష్కలంగా అందుబాటులో ఉండటంతో రైతులు బీడు భూములను, మెట్ట భూములను కూడా వరి పొలాలుగా మార్చి సాగు చేస్తున్నారు. ఇది వరి సాగును పెంచగా, పప్పుధాన్యాల సాగును మరింత తగ్గించింది.

పప్పుధాన్యాల పంట తగ్గుతోంది



గత నాలుగు సంవత్సరాలుగా ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీళ్లు వస్తుండడంతో రైతులు తమ పంట భూముల్లో ఎక్కువగా వరిని సాగు చేస్తున్నారు. దీంతో పప్పు ధాన్యాల పంట తగ్గుతోంది.

– బాలకృష్ణ, ఏఓ, తుంగతుర్తి

కోతుల బెడద.. మరో సమస్య

పప్పుధాన్యాల సాగు తగ్గడానికి మరొక కారణం కోతుల బెడద. కోతులు పెసర, కంది, బొబ్బెర పంటలకు పూత దశ నుంచి కోత వరకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. దీంతో రైతులు ఈ పంటలను సాగు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. కోతుల బెడదను తట్టుకోవడం రైతులకు కష్టంగా మారింది.

ప్రభుత్వ ప్రోత్సాహకం అవసరం..

పప్పుధాన్యాల పంటల సాగును పునరుద్ధరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయం అవసరమని రైతులు కోరుతున్నారు. పప్పుధాన్యాల విత్తనాలపై సబ్సిడీ ఇవ్వాలని, వాటి సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించి ప్రోత్సహించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ చర్యలు పప్పుధాన్యాల పంటల సాగును తిరిగి పెంచి, వాటి ధరలను అదుపులో ఉంచడానికి సహాయపడతాయి. లేకపోతే భవిష్యత్తులో పప్పుధాన్యాలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉంది.

నిలిచిన నీటి సరఫరా.. ప్రజలకు ఇబ్బందులు

నూతనకల్ : చిల్పకుంట్ల గ్రామానికి గత పది రోజుల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామంలోనే మిషన్ భగీరథ ప్లాంట్ ఉంది. ప్లాంట్ ద్వారా మిగతా గ్రామాలకు రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా అవుతోంది. కానీ చిల్పకుంట్ల గ్రామానికి గత పది రోజుల నుంచి నీటి సరఫరా జరగడంలేదు. దీనికి తోడు గ్రామ పంచాయతీ పరిధిలోని మంచినీటి బోర్లు కూడా పనిచేయకపోవడంతో ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈ అశోక్‌ను వివరణ కోరగా.. గత ఐదు రోజుల నుంచి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న విషయం వాస్తవమే అని తెలిపారు. పాలేరు రిజర్వాయర్ రెండు పంపుల్లో ఒక పంపు పనిచేయకపోవడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరించి నిరంతరం నీటిని సరఫరా చేస్తామని తెలియజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత ముఖ్యం


అర్వపల్లి : అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నగేష్

అర్వపల్లి : వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండడం చాలా ముఖ్యమని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ అన్నారు. తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.బిచ్చునాయక్, హెచ్‌ఎం కుంభం ప్రభాకర్, ఏఎన్‌ఎం దుర్గమ్మ, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తుంగతుర్తి : పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్ అన్నారు. బుధవారం సంగెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మౌనిక, హెల్త్ అసిస్టెంట్లు గాజుల సోమన్న, ఏఎన్‌ఎంలు మనీ, నాగమణి, ఆశాలు యాదమ్మ, మాధురి, ప్రధానోపాధ్యాయుడు నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు జనార్దన్, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసమే విజయానికి సోపానం



మాట్లాడుతున్న బందు కృష్ణయ్య

నూతనకల్ : ఆత్మ విశ్వాసమే విజయానికి సోపానం అని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బందు కృష్ణయ్య అన్నారు. బుధవారం మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యువ వికాస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తరగతి గది నుంచే లక్ష్యాలను ఎంచుకొని ఆత్మ విశ్వాసంతో వాటి సాధనకు కృషి చేయాలని అన్నారు. ప్రధానంగా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం.రాములునాయక్, పూర్ణశశికాంత్, లక్ష్మారెడ్డి, నాగం సుధీర్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, షేక్ నాగుల్‌మీరా, ముప్పాని కృష్ణారెడ్డి, రాంకుమార్, ముంతాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైశ్య రణభేరి సభను జయప్రదం చేయాలి


తుంగతుర్తిలోని గాంధీ విగ్రహం వద్ద సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

తుంగతుర్తి : హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆగస్టు 3న జరిగే ఆర్యవైశ్య రాజకీయ రణభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సభ పోస్టర్‌ను ఆర్య వైశ్య నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, క్రమశిక్షణ సంఘం చైర్మన్ బండారు రాజా, నూనె నాగయ్య, మహంకాళి సోమయ్య, ఈగ నాగన్న, ఓరుగంటి శ్రీనివాస్, బండారు దయాకర్, ఈగ లక్ష్మయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : ఆగస్టు 3న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే వైశ్య రాజకీయ రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య మహాసభ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ గుప్తా కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల ఆర్యవైశ్య ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైశ్యులకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ పదవులతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బండారు రాజా, చల్లా వెంకటేశ్వర్లు, నోముల హరిప్రసాద్, వనమా వెంకటేశ్వర్లు, గజ్జల భిక్షమయ్య, తప్సీ నాగయ్య, చంద కృష్ణమూర్తి, గుండా రాంబాబు, మొరిశెట్టి రాములు, గుమ్మడవెల్లి మల్లయ్య, వంగపల్లి లక్ష్మయ్య, శ్రీరంగం నాగరాజు, వంగవీటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాగారం : ఆర్య వైశ్యుల హక్కుల సాధనకు ఆగస్టు 3న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే వైశ్య రాజకీయ రణభేరి సభను జయప్రదం చేయాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆర్యవైశ్య రాజకీయ రణభేరి సభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నూనె నాగన్న, బండారి రాజు, సోమమల్లు, మంచినీళ్ల మహేందర్, బుక్క శ్రీనివాస్, గజ్జం శివాజీ, శ్రీమూర్తి, శివప్రసాద్, నాగయ్య, యాదగిరి, రమేష్, వెంకన్న, శ్రీనివాస్, శ్రీరంగం, యాదగిరి, సంతోష్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలి

అర్వపల్లి : జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు వైశ్యులకు వాటా కల్పించాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం అర్వపల్లిలోని మినీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఆర్యవైశ్య సంఘం మండల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చేనెల 3న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయిలో జరిగే వైశ్య రాజకీయ రణభేరి సభకు వైశ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా సభ పోస్టర్లను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు బొమ్మిడి రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా నాయకులు బండారు రాజ, నాగన్న, సోమన్న, మొరిశెట్టి ఎల్లేష్, చిల్లంచర్ల విద్యాసాగర్, మండల నాయకులు ఇమ్మడి సోమయ్య, మీలా భిక్షం, వెంకటేశ్వర్లు, వెంకన్న, కృష్ణమూర్తి, రామన్న, కర్నాటి యోగి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక


సీహెచ్ సుష్మ

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో టెన్త్ ఫలితాల్లో 541 మార్కులు సాధించిన సీహెచ్.సుష్మ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. రెండవ విడత జాబితాలో సుష్మకు సీటు వచ్చినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం ఎం. విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం బాలికను అభినందించారు. అభినందించిన వారిలో పాఠశాల పీడీ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మల్లేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్‌కు వినతి


వినతిపత్రం ఇస్తున్న బొప్పారం గ్రామస్తులు

ఆత్మకూర్ (ఎస్) : బొప్పారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని టీపీసీసీ రాష్ట్ర నాయకుడు బాషపంగు భాస్కర్ అన్నారు. బుధవారం ఆయన గ్రామస్తులతో కలిసి సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆత్మకూరు మండలంలో చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని తెలిపారు. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించి ప్రమాదాలబారిన పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి బొప్పారం మీదుగా సూర్యాపేట నుంచి ఖమ్మంకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాషపంగు లింగయ్య, పరాల విష్ణుమూర్తి, ఎర్ర ఉమేష్, నాగయ్య, వీరారెడ్డి, ముత్యాలు పాల్గొన్నారు.